# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

ఎడిటర్:బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 9-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 208 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణలో 9న ఇంటర్ ఫలితాలు విడుదల

హైదరాబాద్ మే 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ ఇంటర్ ఫలితాలను ఈ నెల 9 మంగళవారం విడుదల చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రేపు ఉదయం 11 గంటలకు ఫలితాలను విద్యాశాఖామంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. ఇంటర్ ఫస్ట్, సెకండియర్ కలిపి 9.50 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మార్చి 15 నుంచి 29 మధ్య ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ 20 రోజుల క్రితమే పూర్తయింది. పరీక్షలు ముగిసి సుమారు 40 రోజులు గడుస్తున్నప్పటికీ ఇంకా ఫలితాలు ప్రకటించకపోవడంపై విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమైంది.

## నదులపై ప్రాజెక్టులు కడితే కరువే ఉండదు : స్పీకర్ పోచారం



నిజామాబాద్, మే8:గత పాలకుల చేతగానితనంతో దేశంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని శాసన సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. నదులలో లభ్యమయ్యే నీటికి అడ్డుకట్ట వేసి ప్రాజెక్టులు నిర్మిస్తే కరువే ఉండదని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా చందూరు ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా సోమవారం పైప్ లైన్ నిర్మాణ పనులను స్పీకర్ ప్రారంభించారు. అనంతరం వర్ని మండలం లోని జాకోర ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల కన్నీళ్లు తుడవడానికి, భూములకు సాగునీరు అందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులను నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తుండడంతో తెలంగాణ కోటి ఎకరాల మాగాణి అన్నది నిజమవుతుందని వెల్లడించారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు లేకుండా ఆత్మగౌరవంతో బతికే రోజులు వస్తున్నాయని తెలిపారు.

రైతుల ఆలోచన కలిగిన వ్యక్తులే పరిపాలన చేస్తారని అలాంటి నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని అన్నారు. మల్లన్న సాగర్‌నుంచి హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టు లోకి నీళ్ళు వస్తే ఇక పంటలకు డోకా లేదన్నారు. నిజాంసాగర్ 365 రోజులు నిండు కుండలా ఉంటుందని వివరించారు.

బాన్సువాడ నియోజకవర్గంలో రెండు ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట సాగునీటి శాఖ సీఈ శ్రీనివాస్, ఆర్డీవో రాజేశ్వర్, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి , స్థానిక ప్రజాప్రతినిధులు, సాగునీటి శాఖ అధికారులు ఉన్నారు.

## లౌర్దు జ్యోతికి అంబేద్కర్ ఇంటర్నేషనల్ సేవా పురస్కారం

హైదరాబాద్ మే 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమం లో కలానిలయం సంస్కృతిక సంస్థ ప్రముఖ సమాజ సేవకురాలు హెల్ టాటా మని చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చర్మెన్ కాకుమాను లౌర్దు జ్యోతి కి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సేవా పురస్కారం ప్రదానం చేసింది. ఈ అవార్డ్ ను తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాల చారి చేతులమీదుగా లౌర్దు జ్యోతి అందుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ పూర్వా చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ప్రముఖ సినీ దర్శకుడు వేలంగి నరసింహారావు, వేడిది సుబ్బయ్య ట్రస్ట్ అధ్యక్షులు ఎంవి రావు, డాక్టర్ సిహెచ్ బద్రీనాథ్, బిజెపి సిటీ ఈసీ మెంబర్ ప్రతాప్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






### నేటి కందం– నేటికి అందం

కం॥ రెండవ ప్రపంచయుద్ధము
నిండుగ ప్రాణములు తీయ నిశ్చిరగతిలో
ఉండగ నుండుట కొరకై
దండిగ వారలకు నశ్రు తతులందింతున్!!

(మే 9 రెండవ ప్రపంచ యుద్ధ బాధితుల సంస్మరణ దినోత్సవం..)



–రాధశ్రీ
సెల్:9494481210

## ప్రాంతాలు వేరైనా.. పరమాత్ముడు ఒక్కడే.. కేసీఆర్



హైదరాబాద్, మే 8:మనుషులు, ప్రాంతాలు, దేశాలు వేరైనా పూజించే పరమాత్ముడు ఒక్కడేనని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. హైదరాబాద్ కోకాపేటలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం, శ్రీకృష్ణ గో సేవామండలి విరాళంతో నిర్మిస్తున్న హరేకృష్ణ హెరిటేజ్ టవర్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మత మౌఢ్యం ప్రమాదకరమని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మత మౌఢ్యం మనుషులను పిచ్చివాళ్లను చేస్తుందని వెల్లడించారు. మతం, దేవుడు హింసకు వ్యతిరేకమని, మధ్యలో వచ్చినవాళ్లే మత మౌఢ్యాన్ని ప్రేరేపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంతటి ఆధ్యాత్మిక వాతావరణంలో మీ మధ్య ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆలయం సామాజిక సాంత్వన కేంద్రమని వెల్లడించారు.

హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని వెల్లడించారు. నగరంలో హరేకృష్ణ ఆలయం నిర్మించడం మంచి పరిణామని చెప్పారు. ఆలయ నిర్మాణానికి రూ.25 కోట్లు ఇస్తామని ప్రకటించారు. విశ్వశాంతి కోసం మనం ప్రార్థన చేయాలని సూచించారు. మనశ్శాంతి కోసం ప్రస్తుతం చాలామంది మ్యూజిక్ థెరపీ తీసుకుంటున్నారని చెప్పారు. యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించామని తెలిపారు. వేములవాడ, కొండగట్టు ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హరేకృష్ణ ఫౌండేషన్ అక్షయపాత్ర ద్వారా అన్నదానం చేయడం గొప్ప విషయమని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లో ధనవంతులు కూడా రూ.5 భోజనం తింటున్నారని చెప్పారు. ఎంతో చిత్తశుద్ధి ఉంటేనే అక్షయపాత్ర లాంటి కార్యక్రమాలు నడుస్తాయన్నారు. కరోనా సమయంలో హరేకృష్ణ ఫౌండేషన్ ఎన్నో సేవలు అందించిందని కొనియాడారు. అన్ని ఆపద సమయాల్లో ప్రజలకు అండగా నిలిచిందని చెప్పారు.

## కొత్త సచివాలయంలో తొలి కేబినెట్ భేటీ

### –తాజా రాజకీయ పరిణామాలపై నిశితంగా చర్చ

హైదరాబాద్ మే 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ కొత్త సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన తొలి కేబినెట్ భేటీ జరగనుంది. సచివాలయం ప్రారంభించిన తర్వాత మొదట ఇరిగేషన్ అధికారులతో మాత్రమే కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత జరుగుతున్న కేబినెట్ పరంగా జరుగుతున్న మొదటి సమావేశం ఇదే. పాలనా పరమైన సమస్యలు, ఆర్థిక వనరుల సమీకరణపై ఈ భేటీలో చర్చకు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై నిశితంగా సుమారు గంటపాటు చర్చించే ఛాన్స్ ఉంది. కొత్త సచివాలయంలోకి అడుగుపెట్టాక మొదటిసారి భేటీ జరగనుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేబినెట్ భేటీలో కేసీఆర్ ఏమేం మాట్లాడుతారు..? ఏయే విషయాలపై చర్చిస్తారు..? అనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేసీఆర్ ఏమేం చర్చించొచ్చు..? కొందరు మంత్రులకు గట్టిగా తలంటే ఛాన్స్ ఉందా..? పొంగులేటి ప్రస్తావన వస్తుందా..? ప్రతిపక్షాల విమర్శలపై బీఆర్ఎస్ నో రియాక్షన్‌పై కేసీఆర్ ఎలా రియాక్ట్ కాబోతున్నారనే ఇంట్రెస్టింగ్ విషయాలపై ప్రత్యేక కథనం..

ఈ మంత్రులకు తలంటుతారా..!?

ఈ మధ్య మీడియా ముందుకొచ్చినా, బహిరంగ సభల్లో తెలంగాణ మంత్రుల్లో నలుగురైదుగురు అస్తమాను సొంత పార్టీ, స్వరాష్ట్రం విషయాలను కాకుండా.. ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడటం షరామామూలైపోయింది. ఇటు మంత్రులు మాట్లాడటం.. అటు ఏపీ నుంచి కౌంటర్లు రావడం రెండ్రోజులకోసారైనా జరుగుతున్న పరిస్థితి. అయితే ఇది కేసీఆర్‌కు అస్సలు నచ్చట్లేదట. అసలు ఆంధ్రా గురించి మాట్లాడటం ఎందుకు..? అంత అవసరమేంటి..? రచ్చ రచ్చ చేసి వార్తల్లో నిలవడం ఎందుకు..? అని గులాబీ బాస్ గుర్రుగా ఉన్నారట. ప్రస్తుతం ఏపీలో పూర్తిగా బీఆర్ఎస్ కార్యకలాపాలు జరగట్లేదు కదా..? విమర్శలకు హద్దు ఉండక్కర్లేదా..? మాట్లాడాల్సి వస్తే అక్కడ ఉంటే అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ మాట్లాడుతారు కదా..? మీకెందుకు..? అని ఈ విషయాలన్నీ కేబినెట్ సమావేశంలో ప్రస్తావించి మరీ.. ఏపీ గురించి మాట్లాడే మంత్రులకు గట్టిగానే తలంటుతారని టాక్ నడుస్తోంది. అయితే సమావేశంలోనే లేకుంటే ప్రత్యేకంగా క్యాబిన్‌కు పిలిచి ఆ మంత్రులతో కేసీఆర్ మాట్లాడుతారని తెలుస్తోంది. ఏపీ గురించి మాట్లాడిన మంత్రులు ఎవరు..? ఏయే విషయాల గురించి మాట్లాడారు..? అనేది అందరికీ తెలిసిన విషయమే. వాస్తవానికి వైజాగ్ స్టీల్ ప్లాంట్ బిడ్డింగ్‌లో పాల్గొని కాపాడుతామని బీఆర్ఎస్ ఇచ్చిన బిల్డప్ అంతా ఇంతా కాదు.. అయితే ఆఖరికి బిడ్డింగ్ టైమ్‌కు పత్తాలేకుండా పోయింది. ఎందుకిలా జరిగిందనే విషయం పక్కనెడితే 'కాపాడుతాం.. మేం తప్ప ఎవరూ కాపాడలేరు' అని బీఆర్ఎస్ మంత్రులు ఓ రేంజ్‌లో ఊదరగొట్టారు. ఇది బీఆర్ఎస్‌కు బాగా మైనస్ అయ్యింది. ఈ వ్యవహారం సమసిపోకముందే.. మంత్రి మల్లారెడ్డి పోలవరం ప్రస్తావన తేవడం పెను దుమారమే రేపింది. ఇలా ఒకటి పోతే ఒకటి రచ్చ జరుగుతోందే తప్ప.. స్వరాష్ట్రం గురించి పట్టించుకోవట్లేదని కేసీఆర్ ఆగ్రహంతో రగిలిపోతున్నారట.

పొంగులేటి ప్రస్తావన..!

తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయబడిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి జూపల్లి కృష్ణారావుల చుట్టూనే తిరుగుతున్నాయి. కాషాయ కండువా కప్పాలని కమలనాథులు.. రండి 'చేయి' చేయి కలుపుదాం.. తెలంగాణ ఇచ్చిన పార్టీని అధికారంలోకి తెచ్చుకుందామని కాంగ్రెస్ చెబుతోంది. అంతేకాదు పోటాపోటీగా జిల్లాలో ఎన్ని సీట్లు కావాలంటే అన్ని తీసుకోవచ్చని బహిరంగంగానే ఆఫర్లు ఇచ్చేస్తున్నాయి జాతీయ పార్టీలు. ఈ తరుణంలో అసలు పొంగులేటి ఎటువెళ్తారనే దానిపై సందిగ్ధత అయితే నెలకొంది. సరిగ్గా ఇదే సమయంలో 'కొత్త పార్టీ దిశగా పొంగులేటి'.. 'జూన్ 2న పొంగులేటి ముహూర్తం?' అని దమ్మున్న ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు వచ్చాయి. దీంతో ఈ కథనాలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యాయి. అసలు ఇందులో నిజానిజాలెంత..? టీఆర్ఎస్ పేరుతో పార్టీ ఏర్పాటు చేస్తున్నారా..? ఒకవేళ ఇదే నిజమైతే మనం ఎలా ముందుకెళ్లాలి..? నిజంగానే 45 స్థానాలే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవమెంత..? ఇంతకీ పొంగులేటికి టచ్‌లోకి వెళ్లిన బీఆర్ఎస్ నేతలు ఎవరు..? అనే విషయాలపై కేబినెట్ భేటీలో కేసీఆర్ చర్చించబోతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

సచివాలయంలో లీకేజీ విషయం,!?

సచివాలయంలో లీకేజీ విషయం, శరద్ మర్కడ్‌ను కేసీఆర్ ప్రైవేట్ సెక్రటరీగా నియమిస్తూ జీవో జారీ చేయడం, ఇలా కొన్ని కొన్ని రహస్య జీవోలు బయటికి రావడంతో బీఆర్ఎస్‌లోఅంతా గజిబిజిగా అయ్యిందట. అసలు ఇవన్నీ ఎవరు లీక్ చేస్తున్నారు..? ఇది ఎవరు పని..? పనిగట్టుకుని ఇలా చేస్తున్నారా..? ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నదెవరో తెలుసుకుని వారి భరతం పట్టాలని కేసీఆర్ భావిస్తు?న్నారట. ఇంత జరుగుతున్నా కీలక మంత్రులు, ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారు..? అని కేసీఆర్ ఈ సమావేశంలో కన్నెర్రచేసే పరిస్థితులు ఉండొచ్చట.

– సచివాలయం ప్రారంభించిన తర్వాత మంత్రులు పెద్దగా చాంబర్లలో కనిపించట్లేదు. ఒకరిద్దరు మినహా రోజూ సచివాలయంకు వచ్చిన పరిస్థితులు కూడా లేవు. దీంతో కేసీఆర్ గుర్రుగా ఉన్నారట. ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులతో మంత్రులు టచ్‌లో ఉంటూ సమీక్షలు నిర్వహించాలని సూచించబోతున్నారట. మంత్రులంతా మొక్కుబడిగా కాకుండా ప్రతిరోజూ సచివాలయానికి రావాల్సిందేనని అని ఆదేశించే అవకాశాలు కూడా మెండుగానే ఉన్నాయి. కొత్త సచివాలయంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? అని కూడా గులాబీ బాస్ ఆరాతీసే చాన్స్ ఉంది.

మరోవైపు.. కేసీఆర్ ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయ్. ప్రతిపక్ష పార్టీల నేతలు మీడియా ముందుకొచ్చి మాటల తూటాలు పేలుస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఒకరిద్దరు తప్పితే పెద్దగా ఎవరూ స్పందించట్లేదు. దీంతో అసలేం జరుగుతోందో తెలంగాణ ప్రజానీకానికి తెలియని పరిస్థితి నెలకొన్నట్లు బీఆర్ఎస్ భావిస్తోందట. ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని కేసీఆర్ సూచించే ఛాన్స్ ఉంది. ఒక్కరిద్దరే కాదు ప్రతి ఒక్కరూ స్పందించాలని నిజం నిక్కచ్చిగా చెప్పడంలో తప్పేముందని బాస్ చెప్పబోతున్నారట. ఏది పడితే అది మాట్లాడకుండా సబ్జక్ట్ తెలుసుకుని మాట్లాడాలని మంత్రులకు సూచించబోతున్నారట. మొత్తానికి చూస్తే.. కొత్త సచివాలయంలో తొలిసారి జరిగే కేబినెట్ సమావేశం హాట్ హాట్‌గా ఉండబోతోందని మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. భేటీ ముగిశాక పరిస్థితి ఎలా ఉంటుంది..? ఏమేం కీలక నిర్ణయాలు తీసుకుంటారు..? పైన చెప్పిన విషయాలతో ఇంకా ఏమేం చర్చకొచ్చే ఛాన్స్ ఉందనే విషయాలు తెలియాంటే మరికొన్ని గంటలు వేచి చూడాల్సిందే మరి.

## జులై 9న సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలు : మంత్రి తలసాని




హైదరాబాద్, మే 8:బోనాల ఉత్సవాలకు ముహూర్తం ఖారారైంది. జులై 9న సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.. జులై 9న సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలు అధికారికంగా జరుగుతాయని, జులై 10న రంగం (భవిష్య వాణి) ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాల విశిష్టతను మరింత పెంచింది సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు.

## టెక్సాస్ కాల్పుల్లో తెలంగాణ యువతి మృతి



రంగారెడ్డి మే 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అమెరికాలో మరోసారి తుపాకీ పేలింది. టెక్సాస్‌లోని ప్రీమియం ఔట్లెట్ మాల్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఐదేళ్ల చిన్నారి సహా ఏడుగురు గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కాగా.. టెక్సాస్ కాల్పుల్లో మృతి చెందిన వారిలో తెలంగాణకు చెందిన యువతి కూడా ఉంది. ఆమె పేరు ఐశ్వర్య తాటికొండ. ఐశ్వర్య తండ్రి నర్సిరెడ్డి రంగారెడ్డి జిల్లా కోర్టులో జడ్జిగా పని చేస్తున్నారు. టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌కు 25 కిలోమీటర్ల దూరంలోని అలెన్ ప్రీమియం ఔట్‌లెట్స్ అనే పెద్ద మాల్‌లో స్థానిక కాలమానం ప్రకారం శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ మాల్‌లో120 వరకు వివిధ కంపెనీల స్టోర్లు ఉన్నాయి. సెలవు రోజు కావడంతో విపరీతమైన రద్దీ ఉంది. అప్పుడే దుండగుడు మాల్ వద్దకు కారులో వచ్చాడు. కారు బయట ఆపి మాల్‌లోకి చొరబడి కాల్పులు జరిపాడు. కాల్పుల శబ్దం విని భయభ్రాంతులైన వందలాది మంది జనం ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బయటకు పరుగులు తీశారు. ఇంకొంత మంది ప్రాణాలు కాపాడుకునేందుకు మాల్‌లోనే దాక్కున్నారు. మృతుల్లో ఏడుగురు అక్కడికక్కడే చనిపోయారు. మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆ సమయంలో మాల్‌లోనే ఉన్న అలెన్ పోలీసు అధికారి ఒకరు అప్రమత్తమై దుండగుడిని కాల్చిచంపారు. అనంతరం ఎమర్జెన్సీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మృతులను, దుండగుడిని గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు మోచా ముప్పు.. వాయుగుండంగా మారే అవకాశం

హైదరాబాద్, మే8: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది కాస్తా రేపు (సోమవారం) అల్పపీడనంగా మారి వాయుగుండంగా బలపడనుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వాయుగుండం ఉత్తరదిశగా మధ్య బంగాళాఖాతం వైపు కదులుతూ తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపింది.

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం.. అల్పపీడనంగా మారి తెలుగు రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఉత్తరదిశగా మధ్య బంగాళాఖాతం వైపు కదులుతూ తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

ఈ తుపానుకు మోచా అని భారత వాతావరణశాఖ నామకరణం చేసింది. ఇది పశ్చిమ బెంగాల్, మయన్మార్‌ల వైపు పయనిస్తుందని అంచనా వేస్తున్నారు. తూర్పు తీర ప్రాంతాలపై తుపాను ప్రభావం చూపనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు అలర్ట్ అయ్యాయి. ఒడిశాకు తుపాన్ ముప్పు పొంచి ఉండటంతో ప్రభుత్వం తీరప్రాంత జిల్లాలను అప్రమత్తం చేసింది.

మోచా తుపాను దిశ మార్చుకుంటే కోస్తాంధ్ర వైపు కూడా ప్రభావం ఉండొచ్చని వాతావరణ శాఖ చెప్తోంది. కోస్తా, రాయలసీమ జిల్లాలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటికే.. ఆంధ్రప్రదేశ్‌లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలను ఏపీ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. మత్స్యకారులను సముద్రంలోకి వెళ్ళొద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది. అత్యవసర సహాయం, సమాచారం కోసం స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

మరోవైపు.. తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు వర్షంతో పాటు– భారీ ఈదురు గాలులు వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. వర్షాల కంటే ఈదురు గాలుల ప్రభావం అధికంగా ఉంటు–ందని, గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ చెప్పింది.

## సింగరేణిని అమ్మే ప్రయత్నం చేస్తే రామగుండం అగ్గి గుండం అవుతుంది.. మంత్రి కేటీఆర్ హెచ్చరిక



కరీంనగర్, మే 8: తెలంగాణ కొంగు బంగారం సింగరేణి.. రాష్ట్రానికే వెలుగుల మణిహారం సింగరేణి.. సింగరేణి అంటే ఒక కంపెనీ కాదు.. సింగరేణి అంటే తెలంగాణ భాగ్యరేఖ.. తెలంగాణ జీవనాడి అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అలాంటి సింగరేణిని అమ్మే ప్రయత్నం చేస్తే రామగుండం అగ్గి గుండం అవుతుందని కేటీఆర్ కేంద్రాన్ని హెచ్చరించారు. రామగుండ కార్పొరేషన్ పరిధిలో రూ. 300 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకున్న సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

సింగరేణి పట్ల కేంద్రానికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే గవర్నమెంట్ కంపెనీనికి నామినేషన్ మీద ఇవ్వమని అడిగాం అని కేటీఆర్ గుర్తు చేశారు. దాని మీద ఎలాంటి స్పందన లేదు. అదే గుజరాత్‌లో అయితే మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అడిగితే నాలుగు బొగ్గు గనులు రాసిచ్చిండు మోదీ. మన దగ్గరికి వచ్చేసరికి వేలం పాటలో పాల్గొనండి అని చెబుతుండు. గాలి మోటారులో వచ్చి సింగరేణిని అమ్మబోమని అని మోదీ గాలి మాటలు చెప్పిండని గుర్తు చేశారు. తెల్లారే నాలుగు బొగ్గు గనులను వేలానికి పెట్టావు. ఇది వాస్తవం కాదా..? నిజంగా చిత్తశుద్ధి ఉంటే, సింగరేణిని మరింత ముందుకు తీసుకుపోవాలనే ఆలోచన ఉంటే.. వెంటనే ఆ నాలుగు బొగ్గు గనులను సింగరేణికి కేటాయిచాలని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

కేసీఆర్‌తో పెట్టుకుంటే ఎక్కడి దాకనైనా వేటాడుతాం..

ప్రయివేటీకరణ మీద పచ్చి అబద్ధాలు మాట్లాడిన ప్రధాన మంత్రికి కూడా ఈ వేదిక ద్వారా చెబుతున్నాను. నువ్వు వైజాగ్ స్టీల్ ప్లాంట్ అమ్మితే.. అక్కడ కొందరు మాట్లాడొచ్చు.. మాట్లాడకపోవచ్చు. కానీ ఇక్కడ తెలంగాణతో కానీ, కేసీఆర్‌తో కానీ పెట్టుకుంటే మాత్రం విడిచిపెట్టం.. ఎక్కడి దాకనైనా వేటాడుతాం అని హెచ్చరిస్తున్నాను. పొరపాటున సింగరేణిని అమ్మే ప్రయత్నం చేస్తే రామగుండం, ఈ బొగ్గు గని మొత్తం అగ్గిగుండం అవుతుంది అని హెచ్చరించారు. సింగరేణి మనుగడ సాధించాలంటే మన గోడు వినేటోడు ఒకడు ఢిల్లీలో ఉండాలి. ఈ బొగ్గు గనులను కాపాడుకోవాలంటే ఒక్క బీజేపీ అభ్యర్థికి కూడా ఓటేయొద్దు. డిపాజిట్లు గల్లంతు చేసి గుండు కొట్టించి అవతలికి పంపించాలి అని రామగుండం ప్రజలను, సింగరేణి కార్మికులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, బీజేపీ పాలనంతా అవినీతే..

ప్రియాంక గాంధీ కూడా తెలంగాణకు వచ్చిందట.. కేసీఆర్‌ది కుటుంబ పాలన అని ఆమె కూడా అంటారని కేటీఆర్ పేర్కొన్నారు. ఏ టు జడ్ అంతా అవినీతే. ఆకాశంలో స్పెక్ట్రమ్ విడిచిపెట్టలేదు. పాతాళంలో బొగ్గును విడిచిపెట్టలేదు. అలాంటి వారొచ్చి ఇవాళ మనకు అవినీతి గురించి లెక్చర్లు చెబుతారు. ఇక మనం సిగ్గుపడాలి. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్, మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉంది. ఆ రాష్ట్రాల్లో తెలంగాణలో అమలవుతున్న పథకాలు ఉన్నాయా..? మహారాష్ట్ర రైతులు తెలంగాణలో మమ్మల్ని కలుపుకోండని అడుగుతున్నారు. ఇవాళ తెలంగాణ దేశంలోనే అగ్రభాగానా ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో మిమ్మల్ని కోరేది ఒక్కటే. కేసీఆర్ మీ బిడ్డ.. పార్టీ పేరు మారింది.. కానీ పార్టీ డీఎన్ఏ మారలేదు. మంచిగా పని చేసే నాయకులు, ప్రభుత్వాలు కోరుకునేది ఒక్కటే. మంచి తీర్పు ఇవ్వాల్సిన బాధ్యత మీది. కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయాలి అని కేటీఆర్ అన్నారు.

దేశంలోనే సింగరేణి అగ్రశ్రేణి కంపెనీ..

రామగుండానికి మెడికల్ కాలేజీ వచ్చింది. ఇండస్ట్రియల్, ఐటీ పార్కులను కూడా తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. జులై, ఆగస్టు నెలలో తప్పకుండా వచ్చి ఇండస్ట్రియల్, ఐటీ పార్కులకు శంకుస్థాపన చేస్తాం. సింగరేనిలో పని చేసిన, పని చేస్తున్న ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. సింగరేణిలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను కేసీఆర్ నిలబెట్టుకున్నారు. బొగ్గు ఉత్పత్తిలో కానీ, విద్యుత్ ఉత్పత్తిలో కానీ దేశంలోనే సింగరేణి అగ్రశేణి కంపెనీగా వెలుగుతుంది. సింగరేణి కార్మికులు మా జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఉద్యమ సమయంలో నిప్పు రవ్వలై కేసీఆర్ వెంట నిలబడ్డారు. వలస పాలకులకు వ్యతిరేకంగా సింగరేణి సమ్మె చేస్తే ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో కరెంట్ ఉత్పత్తి నిలిచిపోయింది. కార్మికుల పోరాటలను మరిచిపోలేదు. కేసీఆర్ కార్మిక పక్షపాతి అని గుర్తు చేస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు.

